సమస్యల్లో వసతిగృహం

- 150 మందికి నాలుగే మరుగుదొడ్లు
- ఆరుబయటే భోజనం


వెల్దండ బాలుర వసతి గృహంలో కొళాయిల వద్ద స్నానాలు చేస్తున్న విద్యార్థులు


భోజనశాల లేకపోవడంతో ఆరుబయట భోజనం చేస్తున్న విద్యార్థులు

వెల్దండ: వసతిగృహాల్లో అన్ని మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టామని పాలకులు పేర్కొంటున్నా క్షేత్రస్థాయిలో మరోలా ఉంది. ఎంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చి వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. విద్యార్థులకు సరిపడ మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక నరకయాతన అనుభవిస్తున్నారు.

సరిపడా గదులు లేక..

మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో మొత్తం 150 మంది విద్యార్థులు ఉంటున్నారు. వారికి సరిపడా గదులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వసతి గృహం భవనం శిథిలావస్థలో ఉండడంతో పైకప్పు పెచ్చులూడుతున్నాయి. దీంతో ఉన్న గదులల్లో విద్యార్థులు సరిపెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వసతిగృహంలో గదులకు కిటికీలు, తలుపులు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. రాత్రివేళ దోమలు బెడద అధికంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

150 మందికి మూడే మరుగుదొడ్లు..

వసతిగృహంలో ఉంటున్న 150 మంది విద్యార్థులకు కేవలం నాలుగే మరుగుదొడ్లు ఉన్నాయి. దీంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితిలో ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. స్నానాలు ఆరుబయటే చేస్తున్నారు. ఏళ్లుగా ప్రభుత్వం ఎలాంటి నిధులు ఇవ్వకపోవడంతో వసతి గృహంలో సమస్యలు తిష్టవేసినట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు.

ఆరేళ్లుగా నిరుపయోగంగానే..

విద్యార్థుల సౌకర్యార్థం ఆరేళ్ల కిందట 7 మరుగుదొడ్లు, 7 స్నానాల గదుల పనులు ప్రారంభించారు. అప్పట్లో నిధులు సరిపోకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను అసంపూర్తిగానే నిర్మించి వదిలేశారు. దీంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లు ప్రారంభం కాకుండానే శిథిలావస్థకు చేరుకున్నాయని ఆరోపిస్తున్నారు. వసతిగృహంలో భోజనశాల లేకపోవడంతో ఆరుబయటే విద్యార్థులు భోజనం చేస్తున్నారు. అనేక సార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా వసతి గృహంలోని సమస్యలు తీరడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా వసతి గృహంలోని సమస్యలు తీరడం మాత్రం లేదన్నారు.


అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు

సమస్యలు పరిష్కరించాలి



వసతిగృహంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి. సరిపడ మరుగుదొడ్లు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో ఆరుబయటకు వెళ్తున్నాం. 150 మంది విద్యార్థులకు కేవలం నాలుగే మరుగుదొడ్లు వినియోగంలో ఉన్నాయి. అనేకసార్లు అధికారులకు వినతిపత్రాలు అందించాం. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.

– ప్రవీణ్, 10వ తరగతి, వెల్దండ

ఆరుబయటే తింటున్నాం..



వసతిగృహంలోని గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. తినేందుకు సరిపడ స్థలం లేక ఆరుబయటే తింటున్నాం. వర్షాకాలంలో భోజనం చేసేందుకు కూడా ఇబ్బంది పడుతున్నాం. భోజనశాల కూడా లేదు. మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలి. ఇప్పటివరకు దుప్పట్లు కూడా ఇవ్వలేదు. చలికి తట్టుకోలేకపోతున్నాం.

– శివ, 7వ తరగతి, వెల్దండ

మరుగుదొడ్ల సమస్య ఉంది



వసతిగృహంలో మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉంది. 150 మంది విద్యార్థులు ఉన్నప్పటికి కేవలం నాలుగు మరుగుదొడ్లు వినియోగంలో ఉన్నాయి. గతంలో నిర్మించిన 7 మరుగుదొడ్లు అసంపూర్తిగా ఉన్నాయి. సిబ్బంది కొరత వాస్తవమే. ఈ ఏడాది ఇప్పటి వరకు సబ్బుల బిల్లులు అందలేదు. దుప్పట్లు కూడా ఇవ్వలేదు. ప్రభుత్వ నుంచి వచ్చిన వెంటనే అందజేస్తాం.

– రామకృష్ణ, ఇన్‌చార్జ్, వార్డెన్, వెల్దండ

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక డ్రైవ్



లింగాల: సీజనల్ వ్యాధుల నివారణకు అధికారులు, వైద్య సిబ్బంది గ్రామాల్లో మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మండలంలోని చెన్నంపల్లి, పద్మన్నపల్లి, ఎర్రపెంట గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను చేపట్టారు. ఎంపీడీఓ ఆంజనేయులు ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఆయా గ్రామాలలో పర్యటించి సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. జేసీబీతో చెట్ల పొదలను తొలగించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాలలో వైద్య సిబ్బంది బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. వైద్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజశేఖర్, వైద్యాధికారి శివశంకర్, ఎంపీఓ చంద్రశేఖర్, సబ్ యూనిట్ అధికారి బిక్‌లాల్, ఏఎన్‌ఎం యాదాబాయి, హెచ్‌ఏలు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా చందులాల్

అచ్చంపేట: పట్టణానికి చెందిన చందులాల్ చౌహాన్ బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చందులాల్ విద్యార్థి దశ నుంచి ఏబీవీపీలో పనిచేస్తూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తునే రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్‌గా పనిచేశారు. నూతన కమిటీలో పదవి దక్కడం పట్ల మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

బీఎల్‌ఓలకు అవగాహన

వెల్దండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్‌లిస్టుపై బీఎల్‌ఓలకు డిప్యూటీ తహసీల్దార్ శ్రీను మంగళవారం అవగాహన కల్పించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ఓటర్‌లిస్టులో తప్పులు లేకుండా చూడాలన్నారు. కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తులను స్వీకరించాలని, మరణించిన వారి పేర్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శంకర్, బీఎల్‌ఓలు తదితరులు ఉన్నారు.

వర్షం కోసం పూజలు

వెల్దండ: వర్షాలు కురవాలని మండలంలోని దుబ్బతండాలో గిరిజనులు మంగళవారం హనుమాన్‌కు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గిరిజనలు సాంప్రదాయ భజనలు చేస్తు ర్యాలీ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శివరాం, చందర్, గిరిజన నాయకులు దుబ్బతాండ శ్రీనునాయక్, గోపాల్‌నాయక్, దేశ్యనాయక్, రేక్యనాయక్, కిషన్, గోపాల్, పవన్, చరణ్ తదితరులు ఉన్నారు.

ఆధునిక వ్యవసాయంతో లాభాలు

తాడూరు: ఆధునిక వ్యవసాయంతో అధిక లాభాలు పొందవచ్చని రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు సింగారెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మండలంలోని ఇంద్రకల్ రైతువేదికలో వీసీని తిలకించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పంటల సాగు, చీడపీడల నివారణ, యంత్రాల వాడకం వివిధ అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏఈఓలు కార్తీక్, శివప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ

పెద్దకొత్తపల్లి: మారేడుమాన్ దిన్నె గ్రామానికి చెందిన సూగూరి శేఖర్ వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.16,500 ల చెక్కును మాజీ జెడ్పీటీసీ మేకల గౌరమ్మ చంద్రయ్య మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ చటమోని బాలయ్య పాల్గొన్నారు.

ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్ల తయారీపై శిక్షణ

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని జాతీయ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్ల తయారీపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో శిక్షణ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఎన్‌జీఓ ఏకో క్లబ్ 50 పాఠశాల నుంచి పాఠశాలకు ఇద్దరు విద్యార్థుల చొప్పున 100 మంది విద్యార్థులు 8,9 తరగతులు చదువుతున్న వారికి శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా విద్యాధికారి గోవిందరాజులు పేర్కొన్నారు. సైన్స్ అధికారి రాజశేఖర్‌రావు, ఎన్‌జీఓ కోఆర్డినేటర్ రాజశేఖర్, నేషనల్ హైస్కూల్ హెడ్‌మాస్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో మహిళ అదృశ్యం

పెద్దకొత్తపల్లి: వెన్నచర్ల గ్రామానికి చెందిన మహిళ మద్దిని శోభ రెండు రోజుల కిందట భర్తతో గొడవపడింది. దీంతో మహిళ ఇద్దరు కొడుకులు భాను, దాత్రేయ, కూతురు హేమలతలను తీసుకొని సోమవారం ఇంటినుంచి బయటకు వెళ్లింది. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలువలేదు. మహిళ సోదరుడు రమేశ్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

ఎస్‌ఈ లీలావతి బదిలీ

నాగర్‌కర్నూల్‌రూరల్: ఎస్‌ఈ లీలావతిని నాగర్‌కర్నూల్ నుంచి కార్పొరేట్ ఆఫీస్‌కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో నూతన ఎస్‌ఈగా డివిజనల్ విద్యుత్ అధికారి వెంకటేశ్వర్లను నియమించారు.

జేఎల్‌ఎంలకు ప్రమోషన్లు

జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న జేఎల్‌ఎంలకు అధికారులు ప్రమోషన్లు ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఎస్‌ఈగా నియమితులైన వెంకటేశ్వర్లను సన్మానించారు. డీఈ శ్రీధర్‌శెట్టి, ఎస్‌ఏఓ పార్థసారథి తదితరులు పాల్గొనగా వారికి కూడా సన్మానం చేశారు.

స్పీకర్ బాక్స్ వితరణ

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లి చెందిన ప్రాథమికోన్నత పాఠశాల జీహెచ్‌ఎం శివారెడ్డి మంగళవారం విద్యార్థులకు రూ.25 వేల విలువ గల స్పీకర్ బాక్స్‌లను వితరణ చేశారు.

కానిస్టేబుల్ కుటుంబాన్ని ఆదుకుంటాం..

అచ్చంపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ శ్రీనునాయక్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. మంగళవారం శ్రీనునాయక్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రభుత్వ లాంఛనాలతో దహన సంస్కారాలు నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్, ఎస్‌ఐలు రాములు, లెనిన్, గురుస్వామి, పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు

కోడేరు: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థినులకు మంగళవారం 5వ తరగతి నుంచి 10 వతరగతి విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 229 మంది విద్యార్థులకు పరీక్షలు చేయగా 20 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు


బ్రాహ్మణపల్లిలో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు


వెంకటేశ్వర్లబావిలో ..

తెలకపల్లి: మండల కేంద్రంతో పాటు కార్వంగలో శ్రావణమాసం 3వ మంగళవారం పురస్కరించుకొని బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు బోనాలను అలంకరించుకుని శివసత్తుల పూనకాలతో, పోతురాజుల విన్యాసాలతో డప్పు చప్పుళ్ల మధ్య పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆయా గ్రామాల ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లిలో పోచమ్మతల్లికి బోనాలు సమర్పించారు. మాజీ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మన్ననూర్: అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లబావిలో ముత్యాలమ్మ బోనాలు ఘనంగా నిర్వహించుకున్నారు. పసుపు కుంకుమలతో అలంకరించిన బోనాలను మహిళలు ఎత్తుకొని పుర వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. కోళ్లు, పోటేళ్లు, మేకపోతులను బలి ఇచ్చారు.

ఊర్కొండ: మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో పోచమ్మ బోనాల పండుగ వైభవంగా నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లకు అనుగుణంగా నృత్యాలు చేశారు.

దోషులను శిక్షించాలి



నాగర్‌కర్నూల్ క్రైం: కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటనను నిరసిస్తూ మంగళవారం మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. దోషులను శిక్షించాలని కళాశాల ఎదుట నిరసన తెలిపారు. వైద్యులకు రక్షణ కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

పెద్దకొత్తపల్లి: వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని జిల్లా ఉప వైద్యాధికారి వెంకటదాసు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల పరిసరాలను, విద్యార్థులకు వండిన వంటలను, విద్యార్థులు నిద్రించే గదులు, తాగునీటి ట్యాంకులు, వాటర్ ఫిల్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా, చెత్తాచెదారం లేకుండా బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయించాలని ప్రిన్సిపాల్ అకుల్‌కు సూచించారు. విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించారు. సీజనల్ వ్యా ధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్యాధికారి విజయ్‌కుమా ర్, రోహిత్, డీహెచ్‌ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంటలకు నష్టం

కొల్లాపూర్: పలు ప్రాంతాల్లో సోమవారం అర్ధరాత్రి తర్వాత విడతల వారీగా వర్షం కురిసింది. తెల్లవారుజామున బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. మంగళవారం ఉదయం వరకు కొల్లాపూర్‌లో 60.4 మి.మీగా వర్షపాతం నమోదైంది. చెరువుల్లో జలకళ సంతరించుకుంది. పంటపొలాల్లో వర్షపు నీరు నిలిచింది. నేలకొరిగిన మొక్కజొన్న పంటను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల్లో 35 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిందని ఏడీఏ రవి తెలిపారు.

కొల్లాపూర్ రూరల్: వర్ష బీభత్సవానికి సోమశిలలో 36 ఎకరాలు, రామాపురంలో 35 ఎకరాలు, చెన్నంపల్లి శివారులో 30 ఎకరాలు పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. వ్యవసాయ సహాయ సంచాలకులు రవి వ్యవసాయ విస్తరణ అధికారి సుధారాణి క్షేత్ర స్థాయిలో పర్యటించి మొక్కజొన్న పంటను పరిశీలించారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంతో పాటు ఎంగంపల్లితండా, మంచాలకట్ట, మల్లేశ్వరం గ్రామాల్లో మొక్కజొన్న, వరి పంటలు నేలకొరిగాయి. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


పెంట్లవెల్లి మండలం ఎంగంపల్లితండాలో నేలవాలిన మొక్కజొన్న


కొల్లాపూర్‌లో నేలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఆర్‌ఓఎఫ్‌ఆర్ చట్టంపై అవగాహన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండం, గేమ్యానాయక్ తండాకు చెందిన ఫారెస్టు భూములు శిస్తూ చేసుకుంటున్న రైతులకు ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్ ఆర్‌ఓఎఫ్‌ఆర్ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో కొత్తగా పోడు భూములు సాగు చేసుకుంటున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అడవుల రక్షణకు పగడ్బందీగా సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. కాశన్న, ముజీబ్ ఘోరీ, శివకుమార్, మంజుల, నీలేష్, బయన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓగా భాస్కర్‌రెడ్డి

కోడేరు: విద్యాధికారిగా భాస్కర్‌రెడ్డి మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. బిజినేపల్లి ఎంఈఓగా విధులు నిర్వర్తిస్తూ ఆయన కోడేరు మండలానికి బదిలీపై వచ్చారు. అనంతరం ఆయన మండల కేంద్రంలోని వడ్డెరవాడ, హరిజనవాడ పాఠశాలలను తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం సీఆర్‌పీలు ఎంఈఓను సన్మానించారు.

'అధికారం పోయినా అహంకారం తగ్గలేదు'

కల్వకుర్తి: ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పినా మాజీ మంత్రి కేటీఆర్‌కు అహంకారం తగ్గలేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాజీవ్ గాంధీ పేరును విమానాశ్రయం, సచివాలయం నుంచి తొలగిస్తామని చెప్పడం కేటీఆర్ అహంకారానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ఆలోచించి మాట్లాడాలని హితవు పలికారు.

ప్రయాణికులతో బస్టాండ్ రద్దీ



కల్వకుర్తి టౌన్: రాఖీ పండుగ సందర్భంగా మంగళవారం కల్వకుర్తి బస్టాండ్ పూర్తిగా రద్దీగా మారింది. ఉదయం నుండే బస్టాండ్‌లో ప్రయాణికులతో కిక్కిరిసింది. బస్టాండ్‌లో రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేకంగా ఆర్టీసీ సిబ్బందిని కేటాయించారు. రాత్రివరకు బస్టాండ్ ప్రాంగణం ప్రయాణికులతో కిటకిటలాడింది.

రైతులను మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌దే



ఉప్పునుంతల: రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీంద్రరావు, సీనియర్ నాయకుడు కట్టా గోపాల్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏకకాలంలో పంటల రుణాలను మాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక రుణమాఫీలో ఆంక్షలను విధించి మోసం చేశారన్నారు. నాయకులు సంతోష్‌రెడ్డి, శ్రీనివాసులు, చిన్న జంగయ్య, సుధాకర్, బాలస్వామి పాల్గొన్నారు.

సామాజిక సేవతోనే సంతృప్తి

కల్వకుర్తిరూరల్: సామాజిక సేవతోనే సంతృప్తి కలుగుతుందని కల్వకుర్తి డిపో మేనేజర్ సుభాషిణి, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ జూలూరు రమేష్ బాబులు అన్నారు. మంగళవారం రమేష్‌బాబు జన్మదినం సందర్భంగా పట్టణ బస్టాండ్ ఆవరణలో లయన్స్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని వారు ప్రారంభించారు. కల్మిచర్ల రమేశ్, బచ్చు రామకృష్ణ, శ్రీధర్, శ్రీనివాస్, మిరియాల శ్రీనివాస్ రెడ్డి, అప్పాయిపల్లి శ్రీను, కిషన్, రమేశ్, రవిగౌడ్, కృష్ణయ్య, ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'తీజ్' సంబరాలు



మన్ననూర్: స్థానిక ఉమామహేశ్వర కాలనీలో మంగళవారం తీజ్ ఉత్సవాలు నిర్వహించారు. ఐదేళ్లకోసారి 9 రోజుల పాటు నిర్వహించే వేడకలకు గిరిజనులు అధికసంఖ్యలో తరలివచ్చారు. మొలకెత్తించిన గోధుమ మొలకల బుట్టను మహిళలు, ప్రధానంగా యువతులు తమ తలలపై ఉంచుకుని భాజా భజంత్రీలు, డీజే ఆట పాటలతో నృత్యాలు చేస్తూ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. గ్రామ సంస్కృతి సంప్రదాయలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు అమ్రాబాద్ మాజీ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ గిరిజనులతో కలిసి బుట్టలను తలపై ఉంచుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో తండా పెద్దలు, పురుషులు, మహిళలు, యువతీ యువకులు, చిన్నారు పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం

చారకొండ: బదిలీలో భాగంగా మండల వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్ యాదవ్ కొల్లాపూర్‌కు, చారకొండ ఏఈఓ రేణుక ఊర్కొండ మండలం మాదారం క్లస్టర్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో రైతు వేదిక కార్యాలయంలో మంగళవారం వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం అధికారులను పూలమాలతో, శాలువాలతో సన్మానించారు. సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటయ్య యాదవ్, మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, జెల్ల కృష్ణయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, నరేష్ నాయక్, శ్రీను, బాల్‌రాజు, ఏఈఓలు, రైతులు, ఉన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి


కొల్లాపూర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ, విగ్రహాలకు, చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేదలకు దుస్తులు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా అచ్చంపేట, తెలకపల్లి, వెల్దండ, లింగాల, మన్ననూర్, ఊర్కొండలో వక్తలు రాజీవ్‌గాంధీ సేవలను కొనయాడారు. టీపీసీసీ కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు, రాము యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యానాగరాజు, కౌన్సిలర్లు న్యాయవాది మధుసూదన్‌రావు, కౌన్సిలర్లు రహీంపాషా, శిరీషయాదవ్ పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి



కల్వకుర్తిరూరల్: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణం తీసుకున్న రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణ మాఫీ చేయాలని కేఎల్‌ఐ రైతు జేఏసీ నాయకుడు బండెల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. రుణ మాఫీ కాని రైతులతో కలిసి ఆయన వ్యవసాయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బండెల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వివిధ నిబంధనల కారణంగా చాలా మంది రైతులు రుణమాఫీకి లబ్ధి పొందలేదన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కృష్ణారెడ్డి, జంగారెడ్డి, రామిరెడ్డి, శేఖర్‌రెడ్డి, యాదగిరి రెడ్డితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కల్వకుర్తిరూరల్: తర్నికల్ గ్రామానికి చెందిన ఎల్లమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందింది. మృతురాలి భర్త వెంకటయ్యకు మంగళవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ సమకూర్చిన ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గణేష్, సురేష్‌గౌడ్, రుక్మద్దీన్, వెంకటరత్నం, పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు

అచ్చంపేట: పట్టణంలోని 15వ వార్డులో పదిరోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో వార్డు వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కౌన్సిలర్ మనుప్రసాద్ కమిషనర్ శ్యాంసుందర్, చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు దృష్టికి తీసికెళ్లగా వారు మంగళవారం భగీరథం పైపులైన్ పరిశీలించి పైపులో రాళ్ల ఇరుక్కున్నాయని గుర్తించారు. ఈమేరకు రాళ్లను బయటకు తీసి నీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకున్నారు.

'అభివృద్ధిని అడ్డుకుంటున్నారు'



కల్వకుర్తిరూరల్: మున్సిపాలిటీ పరిధిలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆధిపత్య పోరు కారణంగా అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారని బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు బాబీదేవ్ ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు రాజకీయ కక్షలకు పోయి అభివృద్ధిని అడ్డుకోవడం సరి కాదన్నారు. ఆ పార్టీ నాయకుల తీరు కారణంగా రహదారుల గుంతలమయంగా మారాయని వీధిదీపాలు ఏర్పాటు చేయడం లేదని వాపోయారు. వివేకానంద, శశిగౌడ్, లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.